క్లుప్తంగా

సత్వర న్యాయం అందేలా చూడరూ!

సదుం: ఎస్సీ, ఎస్టీ కేసులలో బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని మాల మహానాడు నాయకులు ఎస్ఐ షేక్‌షావలిని కోరారు. మండలంలోని ఊటుపల్లె పంచాయతీ మద్దెలవారిపల్లెలో దళితుడైన గంగాధర్‌పై గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన దాడి కేసుపై ఎస్ఐతో వారు శుక్రవారం చర్చించారు. డీఎస్పీ విచారణ అనంతరం నిందితులపై చార్జిషీట్ దాఖలు చేసినట్లు ఎస్ఐ వారికి చెప్పడంతోపాటు ఆ కాపీ నకలు అందజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణ్‌కుమార్, సురేంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



పెద్దిరెడ్డిని కలిసిన మండల నాయకులు

పులిచెర్ల(కల్లూరు): మండల కన్వీనర్‌గా మరోసారి చెరుకు నాదమునిరెడ్డి నియమితులవడంతో శుక్రవారం మండల నాయకులతో కలిసి ఆయన పుంగనూరు శాసన సభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలోఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, నాగరాజ ప్రసాద్, నిరంజన్‌రెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

చౌడేపల్లె: అదుపుతప్పి ఆటో బోల్తా పడిన సంఘటన శుక్రవారం చౌడేపల్లె–పలమనేరు మార్గంలోని సబ్‌స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. చిట్రెడ్డిపల్లెకు చెందిన నిరంజన్ ఆటో నడుపుతూ చౌడేపల్లె నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ



చౌడంపల్లె వద్ద శిక్షణ కేంద్రంలో కుట్టుమెషిన్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

శాంతిపురం: మండలంలోని రాళ్లబూదుగూరు, చౌడంపల్లె, తుమ్మిశి గ్రామాల్లో ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీఓ ఏపీఆర్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఈఓఆర్డీ రవినాయక్‌తో కలిసి చౌడంపల్లె వద్ద హార్టికల్చర్ హబ్‌లో శిక్షణకు ఏర్పాట్లు, వసతులను ఆయన పరిశీలించారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కలిగించే చర్యల్లో భాగంగా శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఇప్పటికే 380 మంది మహిళలు శిక్షణకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. శిక్షణానంతరం అర్హులందరికీ ఉచితంగా కుట్టు మెషిన్లు అందజేస్తామన్నారు.

మహిళపై దాడి

పుంగనూరు: ఆస్తి గొడవల నేపథ్యంలో ఓ మహిళపై బంధువులు దాడి చేసి గాయపరచిన సంఘటన శుక్రవారం మండలంలోని ఉలవలదిన్నిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. గ్రామస్తురాలు సావిత్రి తన ఇంట ఉండగా, బంధువులు కళ్లల్లో కారం చల్లి, దాడి చేసి, గాయపరిచారు. సీఐ సుబ్బరాయుడు సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలిని విచారణ చేశారు. కేసు నమోదు చేశారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

పుంగనూరు: కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లిన సంఘటన శుక్రవారం మండలంలోని గూడూరుపల్లె సమీపంలోని రైస్ మిల్లు సమీపాన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బైటపడ్డారు.

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

కుప్పం: ప్రభుత్వం రాయితీపై రైతులకు ఇస్తున్న వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై రోటావేటర్లు, మడకలు, కలుపుతీత యంత్రాలు, పవర్ టిల్లర్, పెట్రోల్, బ్యాటరీ పంపులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించుకుని పంటలు సాగు చేయాలని కోరారు. రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, అధికారులు పాల్గొన్నారు.

ధనికులు ఎంత దర్జాగా బతికినా, పేదలు ఇబ్బందులతో జీవించినా చివరకు చేరేది మట్టిలోకే. ఎవరు మరణించినా వారి కులం, మతాచారం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి అంతిమ వీడ్కోలుకు ప్రాధాన్యత ఇస్తారు. కొందరు పేదరికం మూలాన అంత్యక్రియలు కూడా సక్రమంగా చేయలేని పరిస్థితులు చూస్తుంటాం. పేద ముస్లింలు ఎవరైనా మరణిస్తే వారి మతానుసారం అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థానిక సంఘ సేవకుడు జీలుబాయ్ సామాజిక సేవా దృక్పథంతో చేయూతనిస్తున్నారు. అంత్యక్రియలకు అవసరమైన సామగ్రిని సేకరించి, అందుబాటులోకి తెచ్చి ప్రశంసలు అందుకుంటున్నారు.

మౌత్ మిట్టీకే సామాన్

చివరి మజిలీ కోసం సాయం..!

అంత్యక్రియలకు అవసరమైన సామగ్రి (మౌత్ మిట్టీకే సామాన్)



- మృతుల అంత్యక్రియలకు అవసరమైన సామగ్రి ఉచితం
- 12 రకాల వస్తువులతో కిట్లు
- స్థానిక ఖబరస్థాన్ అందుబాటులో ఉంచిన వైనం
- రంజాన్ మాసం నుంచి మొదలైన కార్యాచరణ

పలమనేరు: పట్టణంలో జీలుబాయ్ తన స్నేహితులతో కలిసి కులమతాలతో సంబంధం లేకుండా అనాథలకు అంత్యక్రియలను చేస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ సిలిండర్లు ఇవ్వడంతోపాటు ప్రజలకు ఆ విపత్తులో తనవంతు సేవలు అందించారు. ముఖ్యంగా అనాథ శవాలను శ్మశానానికి తరలించేందుకు ఓ వాహనం ఏర్పాటు చేశారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లోని రోగులకు ఉచిత అంబులెన్స్ సేవలు ఇప్పటికే అందుబాటులో ఉంచారు. అంతటితో ఆయన ఆగలేదు. పేద ముస్లిం కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు పడుతున్న ఇక్కట్లను స్వయంగా చూశారు. అంతే..గత రంజాన్ మాసంలో తన మదిలో మెదిలిన ఆలోచనకు కార్యరూపం ఇచ్చారు. అంత్యక్రియలకు అవసరమైన సామగ్రిని పలు ప్రాంతాల నుంచి తెచ్చి స్థానిక ఖబరస్థాన్ వద్ద మర్కజ్ గదుల్లో అందుబాటులో ఉంచారు.

అన్ని వస్తువులు కలిపి కేవలం రూ.2,500 మాత్రమే!

సాధారణంగా ముస్లింలు మృతి చెందితే వారి అంత్యక్రియలకు కావాల్సిన వస్తువులు ఒకేచోట లభించక ఇబ్బందులు పడుతున్నారు. వ్యయ ప్రయాసల కోర్చి 12 రకాల వస్తువులను కొనాల్సి ఉంటుంది. దీనికితోడు అవసరాన్ని బట్టి వీటి ధరలు పెంచి అమ్ముతుంటారు. ఫలితంగా అంత్యక్రియలకు రూ.5వేల నుంచి రూ.6వేల వరకూ సామగ్రి కోసమే వెచ్చించాల్సి ఉంటుంది. ఆర్థిక స్తోమత లేని పేద ముస్లింలకు వీటిని కొనడం భారమే. దీన్ని గమనించిన జీలు భాయ్ తన మిత్ర బృందంతో కదిరి, మదనపల్లె, కర్ణాటకలోని కోలారు తదితర ప్రాంతాల నుంచి కర్రలు, ఈత చాపలు, రాళ్లుప్పు, కొత్త బట్ట, అవసరమైన సెంట్లు..ఇలా 12 రకాల సామగ్రిని ఒక ప్యాక్‌గా చేసి అందుబాటులోకి తెచ్చారు.

పేదలకు ఉచితం

డబ్బులిచ్చి కొనుక్కునే వారే కాకుండా పేద ముస్లింలకు వీటిని ఉచితంగా ఇస్తున్నారు. అయితే వీరు పేదలని సంబంధిత మసీదు పెద్దల నుంచి ఓ లెటర్ తెచ్చి ఇక్కడి చూపెట్టి అంత్యక్రియలకు అవసరమైన సామగ్రిని ఉచితంగానే పొందేలా చేశారు. దీంతో నియోజకవర్గంలోని ముస్లింలు వీరి సేవలను ప్రస్తుతిస్తున్నారు.

సేవా దృక్పథంతోనే..



డబ్బులున్నవారు అంత్యక్రియలను చేయడం పెద్ద విషయం కాదు. అదే పేద ముస్లింలు అంత్యక్రియల సామగ్రి కొనాలన్నా కష్టమే. పైగా అన్ని వస్తువులు ఒకేచోట దొరకవు. అందుకే అన్నింటినీ కొని స్థానిక ఖబరస్తాన్ సమీపంలోని మర్కజ్ కాంప్లెక్స్‌లో పెట్టాం. దీనికి ముస్లిం మర్కజ్ జమాత్ పెద్దలు హమీద్, అజాం, సలాం బాయ్‌తోపాటు ముస్లిం యువత మద్దతు ఎన్నటికీ మరువలేం.

–జీలుబాయ్, పలమనేరు

నోటీస్ బోర్డు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుప్పం రూరల్: మున్సిపాలిటీలోని కొత్తపేట, డీకే పల్లె, మోడల్ కాలనీ, కుప్పం మండలంలోని పరమసముద్రం, క్రిష్ణదాసనపల్లెలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు రెస్కో ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్ తెలిపారు. అలాగే, గుడుపల్లె మండలంలోని వెంకటాపురం, అలుగుమాకులపల్లె, దిన్నపల్లెలో కూడా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు.

28న కోర్టు విధుల బహిష్కరణ

పుంగనూరు: జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ఈనెల 28న విధులు బహిష్కరిస్తున్నట్టు స్థానిక న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు తెలిపారు. న్యాయవాదులు అందరూ పాల్గొనాలని కోరారు.

2న బ్రాహ్మణుల ఉపనయనాలు

పుంగనూరు: వచ్చే నెల 2న బ్రాహ్మణులకు ఉపనయనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు స్థానిక బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సురేంద్రరావు శుక్రవారం తెలిపారు. నగరివీధిలోని వీడీఎస్ కల్యాణ మండపంలో ఉదయం 7 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి బ్రాహ్మణ పిల్లలు ఉపనయనాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

గంగమ్మ ఆలయంలో పెద్దిరెడ్డి ప్రత్యేక పూజలు



సుగాలిమిట్ట గంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

పుంగనూరు: మండలంలోని సుగాలిమిట్టలో గ్రామస్తులు నిర్మించిన గంగమ్మ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ, గ్రామస్తులు ఐకమత్యంతో ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సంఘ నాయకులు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్, రాజునాయక్, శంకర్ నాయక్, వేణునాయక్, రవినాయక్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి పాటు పడదాం

- మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ దిశా నిర్దేశం



పెద్దపంజాణి నాయకులతో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: నూతన కమిటీలు, నాయకులు వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేయాలని స్థానిక పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ దిశా నిర్దేశం చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పెద్దపంజాణి మండలానికి చెందిన తమ్మిరెడ్డిని జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నేపథ్యంలో ఆ మండల నాయకులతో శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. వెంకటేగౌడ మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. గత ఎన్నికల్లో సైతం మాజీ మంత్రి సొంత మండలంలో వైఎస్సార్‌సీపీకి మంచి ఓట్ల శాతాన్ని ఇచ్చిన నాయకులకు ఎన్నటికీ రుణపడి ఉంటామన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం అందరూ సమష్టిగా పని చేద్దామన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

- రాజంపేట ఎంపీ చొరవతో సాకారం



భూమి పూజ చేస్తున్న నాయకులు

సదుం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవతో సదుంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. తాము కోరగానే విగ్రహం ఏర్పాటుకు ఎంపీ సహకరించారని దళిత సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. భూమిపూజ అనంతరం జెడ్పీటీసీ సభ్యుడిని సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు వినాయకం, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, గిరిబాబు, లోకనాథం, రామాంజులు, శ్రీరాములు, వెంకటనారాయణ, శ్రీనివాసులు, మదన్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉత్సాహం, ఐక్యత



ట్రోఫీలను ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్

గుడుపల్లె: వైద్య విద్యార్థులకు క్రీడలతోనే మరింత ఉత్సాహంగా ఉంటారని పీఈఎస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హెచ్‌ఆర్ క్రిష్ణారావు అన్నారు. శుక్రవారం పీఈఎస్ క్రీడామైదానంలో డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ –13వ ఎడిషన్ ముగిసింది. వారం రోజులుగా నిర్వహించిన టోర్నమెంట్‌లో విజేతలకు ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేసి ఆయన మాట్లాడారు. విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు శశిభూషణ్, కల్యాన్ భరత్ సంతోష్ పాల్గొన్నారు.

30న గంగచాటు

పలమనేరు: పట్టణంలో తిరుపతి గంగమ్మ జాతర సన్నాహాలు మొదలయ్యాయి. స్థానిక ఆలయం వద్ద జాతర కమిటీ శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేసింది. 30న పట్టణంలో చాటు కార్యక్రమంతో జాతర మొదలవుతుందని, ఆపై నిత్యం ఉభయదారుల నిత్యపూజలు, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు ఉంటాయని, మేనెల 14న అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 15న అమ్మవారి విశ్వరూప దర్శనం, 16న జలధి కార్యక్రమాలతో జాతర ముగుస్తుందని కమిటీ తెలిపింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌నాయుడు, డైరెక్టర్లు, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై పెల్లుబికిన ఆగ్రహం





పలమనేరులో బైక్ ర్యాలీ, పుంగనూరు: కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు

పలమనేరు: కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉగ్రవాదుల దారుణకాండపై ప్రజాగ్రహం పెల్లుబికింది. న్యాయవాదులు, పలమనేరు పరిరక్షణసమితి, మాజీ సైనికోద్యోగులు, వాసవిక్లబ్ ఆఫ్ వనిత సభ్యులు శుక్రవారం పట్టణంలో మోటార్ సైకిళ్లతో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఏటీఎం సర్కిల్ వద్ద మాట్లాడారు. పర్యాటకులు ఏ మతస్తులో అడిగి మరీ చంపడం అత్యంత హేయమని నిరసించారు. మతమౌఢ్యం తలకెక్కిన ఉగ్రవాదులను సమూలంగా ఏరివేయాలని, వారికి అన్నివిధాలా అండదండలందిస్తున్న పొరుగు దేశానికీ కేంద్రం గట్టిగా బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద ఇండియన్ మెడికల్ అసోషియేషన్ నేతలు,డాక్టర్లు యుగంధర్, మమతారాణి ఉగ్రవాద ఘటనపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ భాస్కర్, సీనియర్ న్యాయవాదులు, పీపీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రమణ్యం పిళ్లై, నరసింహులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నేత గురురాజారావు, మిలటరీ సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, పలమనేరు రచయితల సంఘ గౌరవాధ్యక్ష, కార్యదర్శులు మాధవ్, కుమారస్వామి రెడ్డి సైతం ఉగ్రవాదుల దుశ్చర్యపై ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

ఉగ్ర దాడి మృతులకు నివాళి

పుంగనూరు: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులు అర్పిస్తూ శుక్రవారం రాత్రి న్యాయవాదులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉగ్రవాద భూతాన్ని తరిమికొట్టేందుకు కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భూసార పరీక్షలపై అవగాహన



మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

శాంతిపురం: భూసార పరీక్షలు చేసి పంటలు సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి అప్పోజి చెప్పారు. శుక్రవారం మఠం వద్ద భూసార పరీక్షలపై రైతుకుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందితో భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు. తద్వారా ఆయా పంటలకు, ఆ నేలకు అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు వేయవచ్చన్నారు.

భూసార పరీక్షలతోనే అధిక దిగుబడి

గుడుపల్లె: భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి నాగరాజు అన్నారు. భూసార పరీక్షల నిమిత్తం శుక్రవారం కనమనపల్లెలో మట్టి ఎలా సేకరించాలో అవగాహన కల్పించారు. ప్రతి 2, 3 ఏళ్ల కోసారి భూసార పరీక్షలు చేసుకోవాలన్నారు.

30న పకడ్బందీగా పాలిటెక్నిక్ ఎంట్రెన్స్



పాలిసెట్‌పై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌డీఓ

పలమనేరు: పట్టణంలో ఈనెల 30న పాలిసెట్ ప్రవేశపరీక్ష పకడ్బందీ నిర్వహించాలని స్థానిక ఆర్‌డీఓ భవాని ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆమె పలమనేరు సెంటర్ల సమన్వయకర్తలకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానికంగా ఐదు సెంటర్లలో 1,621మంది పరీక్షలు రాయనున్నారని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సెంటర్ల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని స్థానిక మున్సిపల్, ట్రాన్స్‌కో, వైద్య, ఆర్టీసీ, శానిటేషన్, పోలీసులు, వైద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వేసవి కారణంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను సైతం అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో స్థానిక పాలిసెట్ కో–ఆర్డినేటర్ మహమూద్, జగన్నాధరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు

చౌడేపల్లె: కౌలు రైతులుగా గుర్తింపు కార్డులు పొందిన వారికి తక్కువ వడ్డీకే పంట రుణాలిస్తామని డీసీసీ బ్యాంకు మేనేజర్ నాగవేణి అన్నారు. పంట రుణాల మంజూరుపై శుక్రవారం సహకార సంఘ కార్యాలయంలో రైతులకు సంఘం పీఏసీ ఆరీఫుల్లా అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మేనేజర్ మాట్లాడారు. రుణాల మంజూరు, ఆర్థిక లావాదేవీలు, రుణాల చెల్లింపు వివరాలపై అవగాహన కల్పించారు. పంట రుణాలపై 7 శాతం, దీర్ఘకాలిక రుణాలపై 12 శాతం వడ్డీకి రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఎకరాకు రూ.లక్ష చొప్పున రుణం, జాయింట్ లయబులిటీ గ్రూపులకు 12 శాతం వడ్డీతో సభ్యుడికి రూ.50 వేల చొప్పున ఐదుగురు కలిసి ఏర్పాటు చేసుకున్న సంఘానికి రూ.2.50 లక్షల రుణం ఇవ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ సూపర్‌వైజర్ ఆదిమోహన్‌రెడ్డి, సీఈఓ మునిరాజ, ఏవో జ్యోతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సేవలు వెల కట్టలేనివి



సామగ్రి అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మి

వి.కోట: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెల కట్టలేనివని స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ పీఎస్ లక్ష్మి అన్నారు. శుక్రవారం 38మంది పంచాయతీ కార్మికులకు సబ్బులు, కొబ్బరినూనె, యూనిఫాం, పాదరక్షలు మొదలైనవి పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఈఓ శివశంకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో జైలు



గంగవరం: బైక్ చోరీ కేసులో ముద్దాయికి పది నెలల పది రోజులు జైలు శిక్ష విధిస్తూ జూనియర్ సివిల్ కోర్టు శుక్రవారం తీర్పు చెప్పినట్లు అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం.. బంగారుపాళెం మండలం కొదలమడుగుకు చెందిన జార్జ్‌లీ ద్విచక్ర వాహనాలను చోరీకి పాల్పడటమే వృత్తిగా పెట్టుకున్నాడు. ప్రస్తుతం ఇతని కుటుంబం వేలూరు జిల్లా అన్నైకట్‌లో ఉంది. ఇతనిపై బంగారుపాళెం పోలీస్ స్టేషన్‌తో పాటు జిల్లాలో పలుచోట్ల అనేక కేసులు నమోదయ్యాయి. అయితే గత ఏడాది మార్చిలో బంగారుపాళెం మండలంసాయినగర్ ప్రాంతంలో బైక్ చోరీకి గురైంది. చోరీకి పాల్పడింది జార్జ్‌లీ అని పోలీసుల దర్యాప్తులో తేలింది. కేసు నిరూపితం కావడంతో పలమనేరు జూనియర్ కోర్టు సివిల్ జడ్జి పైవిధంగా తీర్పు చెప్పినట్టు సీఐ తెలిపారు. దీంతో ఇతన్ని చిత్తూరు జిల్లా జైలుకి తరలించినట్టు ఆయన తెలిపారు.

బసవ జయంతి విజయవంతం చేద్దాం

చౌడేపల్లె: కుప్పం పాతపేటలోని సోమేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 30న నిర్వహించ తలపెట్టిన మహాత్మా బసవ జయంతిని విజయవంతం చేయాలని వీరశైవ లింగాయత్ జంగమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, నియోజకవర్గపు అధ్యక్షుడు ఠాణాదార్ నాగరాజ పిలుపునిచ్చారు. శుక్రవారం చౌడేపల్లెలో సంఘ నేతలతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. సంక్షేమ సంఘం ప్రతినిధులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కుప్పం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బసవరాజులు, దినేష్,ప్రసన్నకుమార్, వీరశేఖరయ్య, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతోనే వ్యాధుల కట్టడి





గంగవరం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, చౌడేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



సదుంలో ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ



కల్లూరులో..



రొంపిచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పలమనేరులో..

గంగవరం: దోమలను నిర్మూలించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నట్లయితే ప్రాణాంతక వ్యాధులు బారిన పడకుండా ఉండవచ్చని వైద్యాధికారులు లహరి, మల్లికార్జున్ రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ, పత్తికొండ పీహెచ్‌సీ వైద్యాధికారులు తమ సిబ్బందితో వేర్వేరుగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ, గ్రామాల్లో మురుగు కాలువల్లో నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

చౌడేపల్లె: మండల కేంద్రంలో వైద్యాధికారి పవన్ కుమార్ నేతృత్వంలో ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ హరి, పీహెచ్‌ఎన్ జయలక్ష్మి, సూపర్‌వైజర్లు బహాద్దీన్, జమున, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ అధికారులు ప్రపంచ మలేరియా దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గిరీశా, సిబ్బంది ఉదయభాస్కర్, నీలకంఠ, జానకి, శిఖామణి, గీత పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులో స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జానకీరావు తమ సిబ్బందితో కలిసి ప్రపంచ మలేరియా దినోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మలేరియా అంతం మనతోనే సాధ్యం

రొంపిచెర్ల: మలేరియా వ్యాధిని అంతం చేయాలంటే మనతోనే సాధ్యం అవుతుందని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం రొంపిచెర్లలో వైద్య సిబ్బందితో కలిసి ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు

పలమనేరు: స్థానిక పాతపేట అర్బన్ ఆస్పత్రి సిబ్బంది ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ జయశంకర్, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పలమనేరు, కుప్పం : 93981 01870
పుంగనూరు : 96524 21441